# స్త్రీ ప్లస్ స్త్రీ ఈజిక్వాల్టు ప్రేమ

కాఫీ బ్రేక్ స్టోరీ

—గిరిజానారాయణ్

**ఎప్పుడూ నవ్వుతూ, అందర్నీ నవ్విస్తూ, తను అలసిపోకుండా, మాకు అలసట తెలీకుండా, గంటలను నిమిషాల్లా దొర్లించే ప్రదీప్, కొద్ది రోజులు నుంచి అదోలా దిగాలుగా ఉడటం నే గమనిస్తూనే వున్నాను.**

కాని, బ్యాంకులో నాలా మిగతావాళ్ళు ఆ విషయాన్ని అంతగా పట్టించుకునే స్థితిలో లేరు. అందుకు అనేక సాంఘిక, సామాజిక కారణాలు వున్నాయి. ముఖ్యంగా అత్యంత వేగమైపోయిన జీవన సరళి కావచ్చు. పైగా, ఈనాటి నాగరిక సమాజంలో ఒకరి సంతోషాన్ని, సుఖాన్ని అందరూ ఆనందంగా పంచుకుంటారేమో గాని, ఒకరి సమస్యల్ని, బాధల్ని, విషాదాన్ని పంచుకోవటానికి ఎవ్వరూ ముందుకు రారు. "ఎందుకొచ్చిన పితకాటం"లే అని దూరం దూరంగా తప్పుకు తిరుగుతారు. ఆ విషయానికి వస్తే నేను ఉలిపికట్టెను. అందుకే ఆ రోజు ప్రదీప్‌ను బయటికి తీసుకెళ్ళి

అతని అంతరంగంలోని సమస్య వెలికి దీయాలని నిశ్చయించుకున్నాను.



ఆ రోజు శనివారం. బ్యాంకు పన్నెండున్నరకే అయిపోయింది. నేను ప్రదీప్ సీటు దగ్గరికి వెళ్లాను.

"ప్రదీప్ నీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలి. నేను ఈ రోజు టిఫిన్ తెచ్చుకోలేదు. ఇప్పుడు బాలానగర్‌లోని టెక్నోక్రాట్స్ కాంటీన్‌లో భోంచేయటానికి వెళ్తున్నాను. నాతో కంపెనీ కోసం నువ్వు వచ్చి తీరాలి" అన్నాను. దాదాపుగా అతనికి తప్పించుకునే అవకాశం లేకుండా చేస్తూ.

అలాగేనని తలూపాడు ప్రదీప్. ఇద్దరం కలిసి ఆంధ్రా బ్యాంకు నుంచి బాలానగర్ వైపు నడక ప్రారంభించాం.

అతని అంతరంగం నాకు బాగా తెలుసు. ఏ సమస్య అయినా పైకి చెప్పుకోడానికి అతను చాలా వెనుకాడే రకం. కాని, నా పద్ధతి వేరు. నేను నా ఆత్మీయులైనవారితో నాకు సమస్య ఏదైనా వస్తే చెప్పుకుంటాను. వాళ్ల సలహా తీసుకుంటాను. వీలైతే అమలు చేస్తాను కూడా. ఈ విధమైన మనస్తత్వంలో గొప్ప రిలీఫ్ వుంటుందని నా నమ్మకం.

నేను ప్రదీప్‌ను గత నాలుగేళ్లుగా మాత్రమే ఎరుగుదును. అదృష్టవశాత్తు కానివ్వండి, లేక విధివశాత్తు కానివ్వండి. ఇద్దరం ఒకేసారి ఈ బ్యాంకులు క్లర్కులుగా జాయినింగ్ రిపోర్టు ఇచ్చాం. అప్పట్నించి ఇక్కడే కలిసి పని చేస్తున్నాం. అతనిలోని జెంటిల్‌మెన్ బిహేవియర్ నాకెంతో నచ్చింది. త్వరలోనే మంచి స్నేహితులమయ్యాం. ఇంతలో ప్రదీప్ ఓ అమ్మాయిని ప్రేమించటం, ఆ వ్యవహారం గమ్మత్తు మలుపులు తిరిగి, చివరికి పెళ్లిగా సుఖాంతమవటం కూడా ఊహించనంత వేగంగా జరిగిపోయింది. తీరా పెళ్లికి వెళ్తే, ప్రదీప్ ప్రేమించిన అమ్మాయి ఎవరో కాదు — చిన్నప్పట్నించి నాతో కలిసి డిగ్రీ వరకూ చదివిన నా క్లాస్‌మేట్ సునందే. అప్పట్నించి వాళ్లింటికి తరచూ వెళ్లి వస్తుంటాను కూడా.

ఇద్దరం మౌనం వహించటం వలన కాబోలు, అడుగులు త్వర త్వరగా పడ్డాయి. కొద్ది నిమిషాల్లోనే ఇద్దరం టెక్నోక్రాట్స్ కాంటీనులోకి వచ్చి పడ్డాం.

రెండు భోజనాలకు ఆర్డరు ఇచ్చి "చూడు ప్రదీప్! నన్ను నిజంగా నీ శ్రేయోభిలాషిగా నువ్వు భావిస్తే, ఈ మధ్య నువ్వు అదోలా వుండటానికి కారణం దాచకుండా చెప్పు" అని నిగ్గదీసి అడిగాను.

అతని ముఖం సిగ్గుతో ఎర్రబడింది. తలవంచుకుని "జయంతి! ఈ కాలం ఆడవాళ్లు ఎందుకు నిర్దాక్షిణ్యంగా మారుతున్నారో నాకు కించిత్తు కూడా బోధపడటం లేదు. ఈ మధ్యన కొంతమంది

కోడళ్లు అత్తింటి ఆరళ్లకు బలై కిరసనాయిలు మంటల్లో తగలబడిన మాట వాస్తవమేమోగాని, అందుకు పెల్లుబికిన సానుభూతి పవనాల్లో అత్తలను, భర్తలను మానసిక వ్యథల్లో కాల్చే ఎంతోమంది కోడళ్లు మాత్రం తెరపైకి రాకుండా పోతున్నారన్నది మటుకు అనుభవైక వేద్యం" అన్నాడు ప్రదీప్.

ఆ ఒక్క మాట చాలు నాకు విషయం ఆకళింపు కావడానికి. అంటే ప్రదీప్ ఇంట కూడా అత్తా కోడళ్ల మధ్య 'అనాది కలికం' రగుల్తోందన్నమాట. ఒక్క క్షణం ఆలోచించి చెప్పాను.

"ప్రదీప్! మీ మగవాళ్లు మాత్రం ఏమంత గొప్పగా ఎదిగి పోయారంటావు. నిజానికి సంఘంలో తిరిగే వ్యక్తిగా, మగవాడిగా సామాజిక అవగాహన ఎంతో వుండవలసిన నాకే ఆ అవగాహన లోపించినప్పుడు, ఓ స్త్రీగా, అనాదిగా నాలుగు గోడల మధ్యనే నలిగి, బానిస మనస్సును వారసత్వంగా పుణికి పుచ్చుకున్న సునందలో ఏం గొప్ప మార్పును ఆశించగలవు?"

నేను వేసిన ఎదురు ప్రశ్నకు మరింత చచ్చిపోయాడు ప్రదీప్. "అంటే! నా అవగాహనలో లోపం వలన కూడా ఇలా జరిగి వుండ వచ్చునా నీ అభిప్రాయం. వివరంగా చెప్పు జయంతి" వేదనగా అడిగాడు అతను.

"పూర్తిగా కాకపోయినా కొంత మేరకు నా పాత్ర కూడా తప్పకుండా వుండే వుంటుంది. అది నీకు తెలీకపోవచ్చు. ముఖ్యంగా తల్లీ, భార్యల మనోభావాలను, ఇరువురికి అర్థమయ్యే రీతిలో అనువాదం చేసి, ఉభయులకు చెప్పి, ఏ దారికి వారిని తెచ్చు కోవడంలో నీ వైఫల్యం నువ్వు అంగీకరించక తప్పదు. ఇక రెండో విషయానికి వస్తే, అనాది బానిసత్వ జీవితం నుంచి బయటపడా లన్న తపన ఈ రోజు ఎంతో మంది స్త్రీలలో కనిపిస్తోంది. ఓ తిరుగుబాటుతో స్వేచ్ఛను సాధించి తనదైన జీవితం గడపాలని ప్రతి స్త్రీ కోరుకొంటోంది ఈ రోజు. అందులో ఆత్రుత, ఆ ఆత్రుతలో తొందరపాటు ఉండటంతో ఆ తిరుగుబాటు 'స్వేచ్ఛ' అనే పదం ఎల్లలు దాటిపోతున్న మాట వాస్తవం. ఇదే నువ్వు ఈ కాలపు కొంతమంది స్త్రీలలో చూస్తున్న విడ్డూరం. దానికి సునంద ఏమీ అతీతురాలు కాదు" అన్నాను నేను.

"అలా అయితే ఈ సమస్యకు పరిష్కారం ఇక లేదంటారా?" ఆ క్షణంలో ప్రదీప్‌ను చూస్తే నాకు ఎంతో జాలి వేసింది.

"ప్రతి సమస్యకు శాంతంగా ఆలోచిస్తే పరిష్కారం దొరక్క పోదు. అయినా మీది ప్రేమ వివాహం కదా. పెళ్లికి ముందు మీరు ఇలాంటి సమస్యల్ని జాగ్రత్తగా చర్చించుకోలేదా? అసలు ఒకరి కుటుంబం పట్ల మరొకరికి అవగాహన లేకుండా పెళ్లి చేసుకున్న మీరు మరి ప్రేమించుకున్న దేమిటి? ఒకరి అందాన్ని మరొకరా? ఇందుకేగా అనేక ప్రేమ వివాహాలు మంట కలిసిపోతున్నాయి. ఇంతకీ ఆ అత్త, కోడళ్ల మధ్య అంత పడని విషయాలు ఏమిటి?" అని ప్రదీప్‌ను కడిగేస్తూ మరీ అడిగాను.

> అసలు మాటకారితనం స్త్రీలకు వెన్నతో పెట్టిన విద్య. దాంతో ఎటు వంటి వాళ్ళనయినా సులువుగా బుట్టలో వేసుకోవచ్చు.

పాపం! నా ప్రశ్నలకు అతని ముఖం కళావిహీనమైంది. అయినా ఫర్వాలేదనిపించింది. అతని వాటా దోసు అతనికి పడటమే న్యాయం అని నా మనస్సు తీర్పు నిచ్చింది.

ప్రదీప్ మౌనం దాల్చటం గమనించి మళ్లీ అడిగాను నేను "ఏం ప్రదీప్? ఏమిటి అత్తా, కోడళ్ల మధ్య సమస్యలకు కారణం?" అని...

నా మాటలను అతను బాగా నొచ్చుకున్నట్టు నాకు సులువుగానే అవగతమవుతోంది. అయినా సరే విషయం రాబట్టాలనే నా దృఢ సంకల్పం.

"అవి చెప్పేంత తీవ్రమైనవి కావు. కాని సునంద వాటిని భూతద్దంలో చూడటం అలవాటు చేసుకుంది. ఓసారి నువ్వు సునందతో మాట్లాడి చూడు, నీకే అర్థమవుతుంది" ముక్తసరిగా జవాబు చెప్పాడు మళ్లీ నే రెట్టించి అడగాల్సిన పని లేకుండా.

"సర్లే. అలాగే మాట్లాడ్తాను. ఈ సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని నా నమ్మకం" అన్నాను నేను. ఇద్దరం బయటికి నడిచాం క్యాంటీనులోంచి.

(2)

"హలో సునందా! ఎలా వున్నావు?" అంటూ ప్రదీప్ ఇంట్లోకి అడుగుపెట్టాను.

"రా! రా! ఇదిగో కనపడటం లేదు నేనూ, నా అవతారం"

"నీకేమే! చక్కని చుక్కవు. రత్నాల రంభవు, వజ్రాల ఊర్వశివి" అన్నాను నేను నవ్వుతూ.

"చాల్లే. నీ వెక్కిరింపు. ఈ ఇంట్లో నేను ఎలా వుంటే ఎవరి క్కావాలి? నే ముస్తాబైతే చూసేందుకు ఆయనకు తీరదు. ఈ ముసల్దానికి నే అలంకరించుకుంటే కడుపు మంట. కళ్లల్లో నిప్పులు పోసుకుంటుంది" అంది సునంద జేవురించిన ముఖంతో.

"అది నీ ఊహనా? నిజంగా మీ అత్తగారు నువ్వు అందంగా అలంకరించుకుంటే నిన్ను ఏమైనా, ఎప్పుడైనా అందా?"

"పైకేమీ అనదు. పిల్లిపైనో, నల్లిపైనో పెట్టి అంటుంది. ఇరుగు పొరుగు అమ్మలక్కలతో గంటల సేపు చర్చలు బెట్టి, వాళ్ల చెవులు తెగ కొరుకుతుంది. ఆయన ఇంటికి వచ్చే వేళ కొత్త దంపతులకు కొన్ని అచ్చటా, ముచ్చటలు వుంటాయని తెలిసి కూడా గడపలోనే తిష్ట వేసుకు కూర్చుంటుంది. నాకు ఆకలేసినా ఈ ముసల్దానికోసం మధ్యాహ్నం దాకా ఆగాలి. టీ.వీ. చూడ టానికి ఓక్షణం దాని ముందు కూర్చుంటే చాలు ఏదో పని చెప్పి లేపి తీరాల్సిందే. అసలు అత్తల్ని కోడళ్లు తగలబెడ్తేగాని, మాకు మంచి రోజులు రావు" అంది సునంద ఆవేశంతో ఊగిపోతూ.

"ఆ రోజులూ వస్తాయి. ఈ తరానికి నీకు ఆ ఆలోచన వచ్చింది గదా! నీ కోడలు తరానికి ఆ ఆలోచన అమలు అవుతుందిలే" అన్నాను నేను సునందను మరి కాస్త ఉడికించాలని.

"అంటే నే ముసల్దాని నయ్యాక మా అత్తలాగే ప్రవర్తిస్తానని, అప్పుడు నా కోడలు నన్ను కిరసనాయిలు పోసి తగులబెడ్తుందనేగా నీ భావం" అంది సునంద ఉడికిపోతూ.

''కాకపోతే ఏమిటే? నీలా చదువు, సంస్కారం వున్నవాళ్లకు రావల్సిన ఆలోచనలేనా ఇవి?''

''కాదు తల్లీ! నువ్వే సంస్కారవంతురాలివి. బ్యాంకు ఉద్యోగస్థురాలివి. సరేనా'' అంది చేతులు జోడించి ఓ దణ్ణం పెడుతూ.

ఆ కొద్దిసేపు సునంద ప్రవర్తన తీరు అది ఎంత గయ్యాళితనంగా ప్రవర్తిస్తున్నదో తెలుసుకోడానికి విఫలమైన తిరుగుబాటుకు మరో రూపం ఇది.

''అది కాదు సునంద. పుట్టింటి నుంచి అత్తారింటికి వచ్చేప్పుడు ఈ కొత్త ప్రపంచంలో మనుషుల్ని మంచి మాటకారితనంతో, నేర్పుతో లాఘవంగా మనవైపు త్రిప్పుకోవాలన్న ఆలోచనతో మనం రావాలి. అసలు మాటకారితనం స్త్రీలకు వెన్నతో పెట్టిన విద్య. దాంతో ఎటువంటివాళ్లనైనా సులువుగా బుట్టలో వేసుకోవచ్చు. ఈ మాత్రం కిటుకు తెలిసినదానివైతే, మీ అత్తగారిని క్షణంలో నీవైపు త్రిప్పేసుకుని వుండేదానివి. ఇప్పుడు మాత్రం మించిపోయిందేముంది. నా సలహా విను. ఆవిడ నీ దారికి వస్తుంది త్వరలోనే'' అన్నాను నేను.

''అదేం కుదరదు. ఊకదంపుడు ఉపన్యాసాలు, సలహాలు ఇవ్వటం చాలా తేలిక. ఆచరణలో అదంత తేలిక కాదు. అయినా పెళ్లీ పెటాకులు లేనిదానివి — నీకేం తెలుస్తాయి సంసార బాధలు'' అంది సునంద నన్ను సులువుగా తీసిపారేస్తూ. ''అయితే ఏం చేద్దామంటావు. నువ్వే చెప్పు'' అని అడిగాను నేను దాని అంతరంగం తెలుసుకుందామని.

''ఆయనకి లక్షసార్లు చెప్పాను. 'ఈ ముసల్దాన్ని తీసికెళ్ళి హోమ్ ఫర్ ది ఏజ్డ్‌లో పడేసి రండి' అని. ఆయన వింటేగా. ఈ ముసల్ది వదిలే వరకూ నాకూ మనశ్శాంతి లేదు. అబ్బబ్బ. పాడు జీవితం. రోత పుడుతోంది'' అంది సునంద..

> ''ఓ స్త్రీ సాయంతో మరో స్త్రీని ప్రేమమయం చేయటాన్ని నా బ్యాంకు భాషలో స్త్రీ ప్లస్ స్త్రీ ఈజ్ ఈక్వల్ టు ప్రేమ'' అని చెప్పాను

ఇక చేసేది లేక నేను సునంద దగ్గర శలవు తీసుకుని, రోడ్డున పడ్డాను.

## (3)

'సునంద కోరిక తీర్చనే తీర్చాడు ప్రదీప్. కాని, ఆ పని చేసినందుకు అతని మనస్సు బాగా గాయపడిందని నాకు బాగా తెల్సు. అయినా నేనిక ఆ విషయం ప్రస్తావించదల్చుకోలేదు. పనికి రాని చర్చలకంటే, పరిష్కారం పట్ల విశ్వాసం ఎక్కువ నాకు. ఈ కాలంలో కోడళ్లను తగలబెట్టే అత్త లెంతమంది వుంటే, అత్తలను బయటికి గెంటాలన్న ఆలోచన వున్న కోడళ్లు కూడా అంతే విస్తృతిలో వున్నారు. ఇలాంటి సాంఘిక పరిణామాలను నేటి రచయితలు, రచయిత్రులు అంతగా పట్టించుకొన్నట్లు కన్పించదు. అథవా పట్టించుకున్నా ఏకపక్షంగా వుంటాయి వారి రచనలు. ప్చ్!' అనుకుని ఒక్కసారి ఊపిరి గట్టిగా లాగి వదిలాను.

## (4)

కాల చక్రంలో రెండు నెలలు దొర్లిపోయాయి. ఓ రోజు ప్రదీప్ ఆఫీసుకి చాలా సంతోషంగా వచ్చాడు. ఆ రోజు అతనిలో సంవత్సరం క్రితం ప్రదీప్‌ను చూశారందరూ. వాళ్ల ఆశ్చర్యం నుంచి తేరుకునేలోపే, నా సీటు దగ్గరికి నేరుగా వచ్చి ''సునందలో హఠాత్తుగా మంచి మార్పు వచ్చింది. నిన్న హోమ్ ఫర్ ది ఏజ్డ్‌కు వెళ్లి మా అమ్మను అక్కడ్నుంచి తనే తీసుకొచ్చేసింది. ఇకపై ఆవిడతో కలిసి మెలిసి వుంటానని, ఆవిడ్ని పరాయిమనిషిగా చూడనని కూడా ప్రమాణం చేసింది'' అని గబ గబ ఒప్పచెప్పేశాడు ప్రదీప్ ఆనందంలో.

అతని మాటలు, ఆ ఆనందం, ఆ కళ్ళలో మెరుపు నన్ను ఉక్కిరిబిక్కిరి చేసాయి ఓ క్షణం. వెంటనే ''అయితే నువ్వు సాయంత్రం నాకో మంచి పార్టీ ఇస్తున్నావన్నమాట'' అన్నాను నేను.

''ష్యూర్'' అంటూ తన సీటు వైపుకు వెళ్లిపోయాడు ప్రదీప్.

## (5)

ఆ సాయంత్రం సునందను, వాళ్ల అత్తగారిని, ప్రదీప్‌ను ముగ్గుర్ని కలిపి ఫోటో తీశాను. వాళ్లిచ్చిన టిఫిన్, కాఫీ తీసుకుని, కాసేపు పిచ్చాపాటి కబుర్లు చెప్పుకున్నాక ''ఇక నే వెళ్లొస్తానండి'' అంటూ లేచాను నేను. వాళ్లు నన్ను మరి కాసేపు కూర్చోమని బలవంతం చేశారు. కాని, నాకు అవతల మరో ముఖ్యమైన పనుంది కాబట్టి ఇక నేను కూర్చోలేదు. సునందను మాత్రం ప్రక్కకు పిల్చి ''ఇదిగో ఈ చీటి తీసుకో. ఇందులో ఓ తారక మంత్రం వుంది. అది రాత్రి పడుకోబోయే ముందు విప్పి చదువుకో. సరేనా'' అంటూ దాని వీపు తట్టి వాళ్లింటి నుంచి బయటపడ్డాను.

## (6)

నాకు ఇప్పుడు మనస్సు ఎంతో హాయిగా వుంది. అసలు సునందను తిరిగి దారిలోకి తేవడానికి, నే వేసిన పథకానికి సునంద వాళ్ల అమ్మ మద్దతు ఇచ్చి వుండకపోతే, ఈ సమస్య ఇంత త్వరలో పరిష్కారమయ్యేది కాదు. నే కోరిన మీదట సునంద వాళ్లమ్మ వెంటనే హోమ్ ఫర్ ది ఏజ్డ్‌లో చేరటం, అందుకు తగ్గట్టుగానే సునంద అన్నయ్య, వదిన సునందను రోషాన్ని రెచ్చగొట్టి, ఆమె అసమర్థతను ఎత్తిచూపటంతో సునంద తన పూర్వపు ఆలోచనా వైఖరి మార్చుకోక తప్పింది కాదు. ఈ మొత్తం మహాయజ్ఞం ప్రదీప్‌కు, సునందకు తెలీకుండా జాగ్రత్తగా నిర్వహించటంలో తనకు బాసటగా నిలిచిన మహామూర్తి సునంద తల్లి ఇలా ఓ స్త్రీ సాయంతో మరో స్త్రీని ప్రేమమయం చేయటాన్ని నా బ్యాంకు భాషలో 'స్త్రీ ప్లస్ స్త్రీ ఈజ్ ఈక్వల్ టు ప్రేమ' అని చెప్పాను నేను. ఇదే ఫార్ములా సునందకు ఇచ్చిన చీటీలో నే రాసింది. అంతే గాని, అసలు రహస్యం మటుకు కాదు. ఇప్పుడు నే తక్షణమే వెళ్లి సునంద వాళ్లమ్మకు నా కృతజ్ఞతలు తెల్పుకోవాలి. అప్పుడే నా కర్తవ్యం పూర్తిగా నెరవేరినట్టు! కాదా!